క్లుప్తంగా

వర్క్ ఇన్‌స్పెక్టర్ల డివిజన్లలో మార్పు

సాక్షి ఎఫెక్ట్..

ఖమ్మంమయూరిసెంటర్: కేఎంసీలో ఎన్నో ఏళ్లుగా ఒకే డివిజన్లలో, ఒకే డీఈఈ వద్ద పని చేస్తున్న వర్క్ ఇన్‌స్పెక్టర్లను వారి డివిజన్లను మార్చుతూ అధికారులు చర్యలు చేపట్టారు. శనివారం 'సాక్షి'లో 'పాతుకుపోయిన పెత్తనం' అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. కమిషనర్ ఆదేశాలతో డ్రాయింగ్ బ్రాంచ్ సెక్షన్‌తో పాటు క్షేత్రస్థాయిలో విధులు నిర్వర్తిస్తున్న వర్క్ ఇన్‌స్పెక్టర్లను మార్చేందుకు ఫైళ్లను సిద్ధం చేశారు. సోమవారం నుంచి వీరి డివిజన్లు మారనున్నాయి.

సమాచారం ఇవ్వండి


దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తి

ఖమ్మంక్రైం: దొంగతనాలకు పాల్పడే ఈ వ్యక్తి గురించి తెలిస్తే సమాచారం అందించాలని ఖమ్మం వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. నగరంలో ఈ వ్యక్తి పలు దొంగతనాలకు పాల్పడుతున్నాడని అతడి ఆచూకీ తెలిసిన వెంటనే ఖమ్మం వనటౌన్ సీఐ 87126 59106 లేదా ఏసీపీ 87126 59105 నంబర్లకు సమాచారం అందించాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని పోలీసులు పేర్కొన్నారు.

సీపీకి ఫిర్యాదు

ఖమ్మంక్రైం: మహ్మమద్ ప్రవక్తపై అనుచిత వ్యాఖ్యలు చేసి ముస్లింల మనోభావాలను దెబ్బతీసిన యతి నర్సింగానంద్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని జామియాత్ ఉలామా సభ్యులు సీపీ సునీల్‌దత్‌కు శనివారం ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ముఫ్తి జలాలుద్దీన్, ఖత్మేనబుత్వత్, మౌలానా అబ్దుల్ సత్తార్, ప్రభుత్వ ఖాజీ ముఫ్తి ఆసిఫ్, మౌలానా హిమాయత్ తదితరులు పాల్గొన్నారు.

అండగా ఉంటా..


ఆర్థిక సాయం అందిస్తున్న మాజీ మంత్రి పువ్వాడ

ఖమ్మంమయూరిసెంటర్: జామా మసీద్ ఇమామ్ అజీజ్ కుటుంబానికి అండగా ఉంటానని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పేర్కొన్నారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన జామా మసీద్ ఇమామ్ అజీజ్ కుటుంబాన్ని శనివారం ఆయన పరామర్శించారు. ఈమేరకు రూ.లక్ష ఆర్థిక సాయాన్ని కుటుంబ సభ్యులకు అందించారు.

అనుమతి లేని నిర్మాణాల తొలగింపు


పోల్స్, ఇటుకలను తొలగించిన దృశ్యం


ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని శ్రీశ్రీ సర్కిల్ సమీపాన బైపాస్ రోడ్డు పక్కన అనుమతలు లేకుండా చేపట్టిన నిర్మాణ పనులను కేఎంసీ టౌన్ ప్లానింగ్ సిబ్బంది అడ్డుకున్నారు. శనివారం నిర్మాణం జరుగుతున్న ప్రదేశానికి వెళ్లి పోల్స్, ఇటుకలను తొలగించారు. అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడితే మున్సిపల్ యాక్ట్ ప్రకారం చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.

పీఆర్టీయూలో సభ్యత్వాలు

రఘునాథపాలెం: మండలంలోని పలు పాఠశాలలో నూతనంగా డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయులుగా చేరిన వారికి శనివారం అభినందనలు తెలిపిన పీఆర్టీయూ నాయకులు సభ్యత్వం అందించారు. ఈ సందర్భంగా సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు కేశవరావు, సైదబాబు మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో పీఆర్టీయూ ఉపాధ్యాయుల యూనియన్ కీలకంగా పని చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా, మండల బాధ్యులు ఉపేందర్‌రెడ్డి, సత్యం, మహతి, చందన, అరుణ, సుజాత, రంగారావు, రిటైర్డ్ హెచ్‌ఎం మోహన్‌దాస్ తదితరులు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

కామేపల్లి: రైతులు పత్తి, మిరప పంటల్లో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఖమ్మం డివిజన్ ఏడీఏ కె.వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం మండలంలోని కామేపల్లి, ఊట్కూర్ గ్రామాల్లో పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించి రైతులకు సలహాలు, సూచనలు చేశారు. పత్తితీత అనంతరం తేమ శాతం లేకుండా ఆరబెట్టుకుని మార్కెట్‌కు తరలించే క్రమంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అలాగే వరిలో కాలిబాటలు ఏర్పాటు చేసుకోవాలని, గట్లపై పిచ్చి చెత్త లేకుండా శుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఓ తారాదేవి, ఏఈఓ శ్రీకన్య, రైతులు పాల్గొన్నారు.



కులం, చిన్న, పెద్దా తేడా లేకుండా ప్రతీ వ్యక్తిని దైవ స్వరూపంగా భావించడమే అయ్యప్ప దీక్ష పరమార్థం. దీని ద్వారా ఆధ్యాత్మిక చింతన పెరగడమే కాకుండా దురలవాట్లకు దూరమై, సంపూర్ణ ఆరోగ్యం, క్రమశిక్షణతో కూడిన జీవన విధానం అలవడుతుందని భక్తుల నమ్మకం. 'శీతల స్నానం తొలి నియమం, భూతల శయనం మలి నియమం'అంటూ భక్తులు అచంచల భక్తితో.. అత్యంత కఠినమైన నియమ నిష్టలతో దైవంపై సంపూర్ణ విశ్వాసంతో ఈ దీక్ష చేపడుతున్నారు.

ఆధ్యాత్మికం.. ఆరోగ్యం!

సండే స్పెషల్


అయప్ప మాల ధరించిన భక్తులు


రాజేశ్వరపురంలో పడిపూజ(ఫైల్)

భక్తిభావానికి ప్రతీక అయ్యప్ప దీక్ష

- ఏటేటా పెరుగుతున్న అయ్యప్ప దీక్షదారులు
- భక్తుల పాలిట కల్పతరువుగా మణికంఠుడు
- నియమ నిష్టలతో 41 రోజుల పాటు దీక్ష
- శబరిమలలో ఇరుముడి సమర్పణ

నేలకొండపల్లి: 'స్వామియే శరణం అయ్యప్ప' అంటూ ఆలయాలు మారుమోగుతున్నాయి. ఏటేటా అయ్యప్ప దీక్షాదారుల సంఖ్య పెరుగుతూ కార్తీకమాసం ఆరంభంలో జోరందుకున్నాయి. ఆ మణికంఠుడు భక్తుల పాలిట కల్పతరువుగా కోరిన కోర్కెలు తీరుస్తున్నాడనే నమ్మకం. దీంతో ఏటా అక్టోబర్ మాసం నుంచి మకర సంక్రాంతి వరకు అయ్యప్ప దీక్ష చేపట్టి 41 రోజుల పాటు కఠిన నియమ నిష్టలతో స్వామివారి సేవలో గడుపుతారు. ఉమ్మడి జిల్లాలో భక్తిభావం పెరుగుతూనే ఉంది.

ఆరోగ్య హేతువులు..

సాంకేతిక యుగంలో మానసిక, శారీరక ప్రశాంతతకు ఆధ్యాత్మిక మార్గం దివ్య ఔషధమని వైద్యులు సైతం సూచిస్తున్నారు. అయ్యప్ప స్వామి భక్తులు ఉదయం తెల్లవారుజామున 4గంటలకు నిద్ర లేవడం, చన్నీటి తలంటి స్నానం చేయటం, పాదరక్షలు లేకుండా కాలినడకన ఆలయానికి వెళ్లి పూజలు చేయడం ఆరోగ్యానికి చిహ్నంగా చెప్పొచ్చు. అలాగే నల్లటి వస్త్రాలకు ఉష్ణాన్ని గ్రహించే శక్తి ఉండడం, ఉపవాసాలతో శరీర ఉష్ణోగ్రతను సమంగా ఉంచడవన్నీ ఆరోగ్య హేతువులే. నుదుటి మీద విభూతి, గంధం, చందనాలతో నాడీ వ్యవస్థ ఒత్తిళ్లను అధిగమించే అవకాశం ఉంటుంది.

అయ్యప్ప అనుగ్రహానికి మార్గం..

అయ్యప్ప స్వామి వారి అనుగ్రహం పొందేందుకు 41 రోజులు దీక్ష చేపట్టి చివరి రోజు ఇరుముడితో కేరళలోని శబరిమలకు బయలుదేరుతారు. స్వామి దర్శనం కోసం ఆన్‌లైన్‌లో బుకింగ్ చేసుకొని బయలుదేరగా.. అక్కడి ప్రభుత్వం ప్రత్యేకంగా బుకింగ్ కౌంటర్లు తెరిచింది. ఆన్‌లైన్ బుక్ చేయకుండా దర్శనానికి వెళ్లిన స్వాములు స్పాట్ బుకింగ్ కోసం ఎరుమేలి, నిలక్కల్, కుముళి చెక్‌పోస్టు శ్రీ గణపతి ఆలయం, పందళ ప్యాలెస్ ఆలయం, శ్రీ ధర్మశాస్త్ర ఆలయం తదితర చోట్ల సమాచార కేంద్రాలను ఏర్పాటు చేశారు. కాగా, ఈ ఏడాది రోజుకు కేవలం 80 వేల మందికి మాత్రమే అవకాశం కల్పించారు. మాలధారణ భక్తులు గురుస్వామి వెంటనే యాత్రలో అంటిపెట్టుకుని ఉండాలి.

ప్రసిద్ధ ఆలయాలు..

ఖమ్మం ఉమ్మడి జిల్లాలో అయ్యప్ప హరిహర క్షేత్రాలకు ప్రత్యేక స్థానం ఉంది. ఖమ్మం, వైరా, భద్రాచలం తదితర పట్టణాలలోని అయ్యప్ప దేవాలయాలలో వేలాది మంది భక్తులు దీక్షలు తీసుకుంటారు. దీక్ష కాలం ముగిసే వరకు స్వాములకు నిత్యాన్న దానం (భిక్ష)ను ఏర్పాటు చేస్తారు. ఒకప్పుడు పట్టణాలలో కనిపించే స్వాములు, నేడు ప్రతీ పల్లెల్లో కనిపిస్తున్నారు. దీంతో నేలకొండపల్లి మండలంలోని చెరువుమాధారం, మంగాపురంతండా, నేలకొండపల్లిలో 90 మంది చొప్పున మాలధారణ స్వీకరించగా వాసవీ భవన్‌ను 30 ఏళ్ల నుంచి అయ్యప్ప పీఠాన్ని ఏర్పాటు చేసుకుని పూజలు చేస్తున్నారు.

23 ఏళ్లుగా మాలధరిస్తున్నా..



వాసవీ భవన్ పీఠంలో నేను 23 ఏళ్లుగా మాలధరించా. ప్రతి ఏటా భక్తుల సంఖ్య పెరుగుతోంది. ఈ ఏడాది 90 మంది భక్తులు పీఠంలో ఉన్నారు. మాలధారణతో తన జీవితం సంతృప్తికరంగా ఉంది. స్వామి తోడుగా ఆధ్యాత్మికలో జీవిస్తున్నాం.

– పావులూరి వెంకటేశ్వర్లు స్వామి, గురుస్వామి

ఆధ్యాత్మిక వైపు పయనం..



ప్రతి ఒక్కరూ భక్తి మార్గంలో పయనించాలి. అది ఎంతో సంతృప్తిని ఇస్తుంది. దైవ చింతనలో గడపడం, ఆధ్యాత్మిక భావాలతో ఉండడం వల్ల మంచి అలవాట్లు వస్తాయి. దేవుని మార్గం నాకు మంచి కలుగుతుంది. అందుకే మాల వేసుకున్నా.

– వేముల విజయ్ స్వామి, భక్తుడు

ఒక్కసారైనా మాల వేసుకోవాలి..



ప్రతీ మనిషి జీవితంలో ఒక్కసారైనా అయ్యప్ప మాలధారణ స్వీకరించాలి. అప్పుడే జన్మసార్థకత కలుగుతుంది. నేను ఆరు సార్లు మాల వేసుకున్నా. శబరిమల యాత్ర నా జీవితాన్ని మార్చేస్తుంది. నాలో భక్తి మార్గం ను ప్రతీ ఏటా పెంపొందిస్తుంది.

– బోయిన వేణు స్వామి, రాయగూడెం, భక్తుడు

వైద్యంలో సాంకేతికత పెంచాలి


సదస్సులో పాల్గొన్న నరసింహాల్ తదితరులు

ఖమ్మంఅర్బన్: వైద్య రంగంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలని నేషనల్ అసోసియేషన్ ఆఫ్ ఫిజిసియాన్స్ చైర్మన్ గుమ్మాడల్ నరసింహాల్ పేర్కొన్నారు. ఖమ్మంలోని మమత ఆస్పత్రిలో రెండు రోజుల పాటు జరగనున్న టీఎస్ ఏపీకాన్ జాతీయ స్థాయి సదస్సును మమత వైద్య సంస్థల చైర్మన్ పువ్వాడ జయశ్రీ ప్రారంభించారు. ఈ సందర్భంగా నరసింహాల్ మాట్లాడుతూ.. వైద్యరంగంలో సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా నూతన ఆవిష్కరణలు తీసుకురావాలని.. తద్వారా వైద్యం సులభమై అందరికీ మెరుగైన సేవలందుతుందుతాయని చెప్పారు. ఫిజిసియాన్ రాష్ట్ర చైర్మన్ కె.రమేశ్‌తో పాటు వైద్యులు ఎం.పవన్‌కుమార్, కె.శివరామకృష్ణ, కె.శ్రీకాంత్, కొల్లు అనుదీప్ తదితరులు పాల్గొన్నారు.

'టీఎన్జీవోస్ అండగా ఉంటుంది'


కార్యవర్గాన్ని సన్మానిస్తున్న దృశ్యం

ఖమ్మంసహకారనగర్: టీఎన్జీవోస్ యూనియన్ ఉద్యోగులకు ఎల్లవేళలా అండగా ఉంటుందని యూనియన్ జిల్లా నాయకులు పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్ కార్యాలయంలో కార్యవర్గ సమావేశం నిర్వహించగా కొణిదెన శ్రీనివాస్, గుంటుపల్లి శ్రీనివాస్, జమ్మి ఎస్.జయపాల్, మాజీ జిల్లా అధ్యక్షులు రామయ్య, కొమరగిరి దుర్గాప్రసాద్ తదితరులు మాట్లాడారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నికైన నూతన కమిటీ సభ్యులు మురళీమోహన్, సతీశ్‌రెడ్డి, ఉపేందర్, కిరణ్‌కుమార్, ఉషారాణి, నాగేశ్వరరావు, శివ, ఆంజనేయులు, మధుమోహన్, భరత్, యాకుబీలను అభినందించారు. అనంతరం సర్వే ల్యాండ్ రికార్డ్స్ నూతన కార్యావర్గాన్ని పరిచయం చేశారు. కార్యక్రమంలో గంగవరపు బాలకష్ణ, సగ్గుర్తి ప్రకాశరావు, వల్లపు వెంకన్న, బుసా చంద్రశేఖర్, పెద్దినేని రాధాకష్ణ, అస్లాం, పవన్, బాలాజీ, అప్పారావు, లక్ష్మీకుమారి, అరుణ తదితరులు పాల్గొన్నారు.


ఇళ్ల పట్టాలకు మోక్షం..

నేలకొండపల్లి: మండలంలోని మోటాపురంలో గల ప్రభుత్వ స్థలంలో క్రీడా ప్రాంగణం, నర్సరీలకు కేటాయించిన తర్వాత దాదాపు 5 ఎకరాల వరకు స్థలం మిగిలి ఉంది. అయితే ఇటీవల స్థానికులు ఇళ్ల స్థలాల సమస్యను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి దృష్టికి తీసుకెళ్లగా.. స్పందించిన ఆయన వెంటనే రెవెన్యూ అధికారులను ఆదేశించారు. దీంతో శనివారం నేలకొండపల్లి తహసీల్దార్ జె.మానిక్‌రావ్ క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రభుత్వ స్థలానికి హద్దులు నిర్ణయించారు. దాదాపు 4.20 ఎకరాలు ఉన్నట్లు గుర్తించామని, మరో రెండు రోజుల్లో పూర్తి వివరాలు వెల్లడించనున్నట్లు తహసీల్దార్ తెలిపారు. మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రవి, సర్వేయర్ మధుమోహన్, స్థానికులు పాల్గొన్నారు.

మరోమారు మొండిచేయి

ఖమ్మంసహకారనగర్: విశ్వ విద్యాలయాల వైస్ చైర్మన్ల నియామకాల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లాకు ప్రభుత్వం మరోమారు మొండిచేయి చూపిందని అసోసియేషన్ ఆఫ్ కాకతీయ యూనివర్సిటీ డాక్టరేట్స్ వరంగల్ అధ్యక్షుడు డాక్టర్ కొల్లు నరసింహారావు, వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ రాజీవ్‌రాజ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లాకు చెందిన విద్యావేత్తలు, తెలంగాణతో పాటు దేశంలోని ప్రతిష్టాత్మక విశ్వవిద్యాలయాల్లో ప్రొఫెసర్లుగా పని చేస్తున్నా.. ఎవరినీ రాష్ట్ర ప్రభుత్వం నియమించలేదన్నారు.

మూఢ నమ్మకాలను వీడి విజ్ఞానం వైపు పయనించాలి


బౌద్ధక్షేత్రం వద్ద బైరి నరేష్, తదితరులు

నేలకొండపల్లి: ప్రజలు మూఢనమ్మకాలను వీడి విజ్ఞానం వైపు అడుగులు వేయాలని సామాజిక ఉద్యమకారుడు బైరి నరేష్ సూచించారు. మండల కేంద్రంలో శనివారం జరిగిన దివ్యమూర్తి సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన బౌద్ధక్షేత్రాన్ని సందర్శించారు. ఈసందర్భంగా నరేష్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత కళాకారుల నైపుణ్యాన్ని గుర్తించి ఆదరించాలని, యువత చెడు మార్గాల వైపు పయనించకుండా ప్రతిభ మెరుగుపరుచుకోవాలని తెలిపారు. అంతేకాక మేధావులు, విద్యావంతులను గౌరవించే సంస్కృతి పెరగాలని, పతనమవుతున్న విలువలను కాపాడుతూ మహిళలు, పిల్లలకు భద్రత కల్పించాలని సూచించారు. వివిధ సంఘాల బాధ్యులు బి.సైదారావు గౌడ్, పల్లెపొంగు నాగభూషణం, కె.బాబురావు, సూరేపల్లి జ్ఞానరత్నం, కాలెపొంగు బాబు, కాకుమాను మల్లికార్జున్‌రావు, తోళ్ల వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఖమ్మంవ్యవసాయం: నగరంలోని 33/11 కేవీ రామాలయం సబ్ స్టేషన్ 11 కేవీ కమాన్ బజార్ ఫీడర్ పరిధిలో నిర్వహణ పనుల కారణంగా ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని టౌన్–5 సెక్షన్ ఏఈ జె.ప్రభాకర్‌రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో కమాన్‌బజార్, కస్బాబజార్, వల్లాల వారి వీధి, షాదీఖానా, స్టేషన్‌రోడ్, బొమ్మన సెంటర్, శాంతి లాడ్జ్, వినోద థియేటర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

నేడు నాలుగో తరగతి ఉద్యోగుల సమావేశం

ఖమ్మం సహకారనగర్: తెలంగాణ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా కార్యవర్గ సమావేశం నేడు(ఆదివారం) ఉదయం 10 గంటలకు ఇందిరానగర్‌లోని నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం కో హౌస్ బిల్డింగ్ సొసైటీ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గుగులోతు బిక్కు, కాంపాటి వెంకటరమణలు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో సకల ఉద్యోగుల వన భోజనాలు, ఇళ్ల స్థలాలు, పదోన్నతులు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్ తదితర అంశాలపై చర్చించనున్నట్లు సంఘం బాధ్యులు తెలిపారు.

ఆహ్వానాలు అందజేత


సమ్మేళనానికి ఎంపీ, ఎమ్మెల్యేలను ఆహ్వానిస్తున్న నాయకులు

ఖమ్మం సహకారనగర్: వచ్చే నెల 3వ తేదీన జరిగే సకల ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరు కావాలని ఎంపీ రఘురామిరెడ్డి, వైరా ఎమ్మెల్యే రాందాస్‌లు తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం, తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ యూనియన్ నాయకులు ఆహ్వానించారు. నగరంలోని గొల్లగూడెం సమీపాన ఈ కార్యక్రమం జరగనుందన్నారు. టీజీఓ జిల్లా కార్యదర్శి మోదుగు వేలాద్రి, టీఎన్జీవోస్ నాయకులు కొణిదన శ్రీనివాస్, గుంటుపల్లి శ్రీను, పెద్దినేని రాధాకృష్ణ, గంగవరపు బాలకృష్ణ, జైపాల్, చంద్రశేఖర్, దుర్గాప్రసాద్, కోనార్, ప్రవీణ్, అనంతరాములు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రగతిపై డీఈఓ ఆరా..


విద్యార్థుల ప్రగతిని పరిశీలిస్తున్న డీఈఓ

రఘునాథపాలెం: విద్యార్థుల ప్రగతి పెంపొందించేలా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు దృష్టి సారించాలని జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖర్ శర్మ పేర్కొన్నారు. శనివారం రఘునాథపాలెంలోని జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా 10వ తరగతి విద్యార్థుల ప్రగతిపై ఆరా తీసి అసంతృప్తి వ్యక్తం చేశారు. వెంటనే ఉపాధ్యాయులతో సమావేశం ఏర్పాటు చేసి ప్రత్యేక చొరవ తీసుకుని విద్యార్థుల ప్రగతిని మెరుగుపర్చాలన్నారు. అనంతరం అంగన్‌వాడీ టీచర్లకు ప్రోత్సాహక బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ఎం.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బంది కలగనివ్వొద్దు


మాట్లాడుతున్న ఏడీఏ సరిత

కూసుమంచి: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు నాణ్యత ప్రమాణాలు పాటించేలా వారికి అవగాహన కల్పించాలని కూసుమంచి ఏడీఏ సరిత సూచించారు. శనివారం కూసుమంచిలోని రైతు వేదికలో పాలేరు డివిజన్‌లోని ఏఓలు, ఏఈఓలతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. వరి కోతలు ప్రారంభం కానుండగా.. కేంద్రాల్లో చేయాల్సిన ఏర్పాట్లు, రైతులు పాటించాల్సిన నియమ, నిబంధనలపై వివరించారు. రైతులకు ఇబ్బందులు లేకుండా కొనుగోళ్లు జరిగేలా చూడాలన్నారు. పంటల నమోదు, రైతు బీమా నమోదును త్వరితగతిన పూర్తిచేయాలన్నారు.ఆయిల్‌పామ్‌ను రైతులు సాగు చేసేలా వారిని ప్రోత్సహించాలని, ఇందుకు ప్రభుత్వం అందిస్తున్న రాయితీలపై అవగాహన కల్పించాలని ఏడీఏ సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఓలు,ఏఈఓలు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా సదస్సును జయప్రదం చేయండి


సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

ఖమ్మం మామిళ్లగూడెం: ఎస్సీ వర్గీకరణను తక్షణమే అమలు చేయించుకునేలా మరో పోరాటానికి సిద్ధంగా ఉండాలని ఎమ్మెస్పీ రాష్ట్ర నాయకుడు బచ్చలకూర వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్షుడు తూరుగంటి అంజయ్య అన్నారు. శనివారం ఖమ్మం అంబేడ్కర్ భవన్‌లో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. ఈ నెల 25న ఖమ్మం టీఎన్జీవోస్ ఫంక్షన్ హాల్‌లో ఉదయం 11 గంటలకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణమాదిగ అధ్యక్షతన నిర్వహించే ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ అనుబంధ సంఘాల ఖమ్మం ఉమ్మడి జిల్లా సదస్సును జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో నాయకులు గాజుల నరసింహారావు, రాము, శ్రీను, మంద గోపాలరావు, సైదులు, వెంకటరత్నం, వెంకన్న, కుక్కల శ్రీను, రాకేష్, దేవరకొండ రాము, కత్తుల శ్రీను, వీరస్వామి తదితరులు పాల్గొన్నారు. అలాగే ఖమ్మంలో జరిగిన మరో కార్యక్రమంలో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి జిల్లా కన్వీనర్ గుంతేటి వీరభద్రం, రాష్ట్ర కో చైర్మన్ పల్లా రాజశేఖర్, లింగాల రవికుమార్ మాట్లాడుతూ.. రాజ్యాంగ విరుద్ధమైన ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా గ్రామాలకు వెళ్లి మాలలను చైతన్య పరచాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు ముడుసు జాకోబ్ ప్రతాప్, దామళ్ల సత్యనారాయణ, సుధాకర్, గుమ్మడి కనకరాజు, బాబూరావు, తొగరు భాస్కర్, కాలంగి దేవదానం, చిరంజీవి, నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

సీటీ స్కాన్, టిఫా సేవలు పునరుద్ధరించాలి


సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వాస్పత్రిలో సీటీ స్కాన్, టిఫా సేవలను వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ శనివారం ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎల్.కిరణ్‌కుమార్‌కు సీపీఎం టూ టౌన్ కమిటీ ఆధ్వర్యాన వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు వై.విక్రమ్ మాట్లాడుతూ.. గత కొద్దిరోజులుగా సీటీ స్కాన్, టిఫా సేవలు నిలిచిపోవడంతో పేద, మధ్య తరగతి ప్రజలు ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తూ ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. అలాగే తాగునీటి సౌకర్యం సరిగాలేదని, గుండె సంబంధిత డాక్టర్‌ను నియమించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ టూ టౌన్ కార్యదర్శి బోడపట్ల సుదర్శన్, నాయకులు రమేష్, భద్రం, ఉపేంద్ర, సాగర్, నాగరాజు, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళాల వెల్లువ

రఘునాథపాలెం: మండలంలోని కోయచలకలో నిర్మించనున్న శ్రీమద్విరాట్ పోతులూరి వీర బ్రహ్మేంద్రస్వామి దేవాలయానికి దాతల నుంచి పెద్ద ఎత్తున విరాళాలు అందిస్తున్నట్లు దేవాలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈమేరకు శనివారం కాంపాటి రామచంద్రయ్య రూ.20వేలు, రామకృష్ణ, వీరకృష్ణలు రూ.45 వేల విలువైన ఇటుకను, తిరుపతిరెడ్డి రూ.30 వేల విలువైన ఇటుకను, మోడిపల్లి సత్యనారాయణ కుమారుడు రంగాచారి దంపతులు రూ.10,016, ముస్తఫానగర్‌కు చెందిన తూమాటి రామకోటిచారి రూ.10 వేలు, గుంటి నాగయ్య రూ.5,016, అమరం సీతరామయ్య జ్ఞాపకార్థం కుటుంబసభ్యులు రూ.5,116, దొండపాటి రంగయ్య రూ.3,016లను అందించినట్లు తెలిపారు.

జిరాక్స్ మిషన్ వితరణ

రఘునాథపాలెం: రఘునాథపాలెంలోని ప్రాథమిక పాఠశాలకు గ్రామానికి చెందిన విప్పర్ల వాసు సుమారు రూ.20 వేల విలువైన జిరాక్స్ మిషన్‌ను శనివారం వితరణ చేశారని హెచ్‌ఎం రాధా రుక్మిణి పేర్కొన్నారు. శనివారం పాఠశాలలో పాఠశాల కమిటీ చైర్మన్ మంజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో హెచ్‌ఎం వివరాలు వెల్లడించి పాఠశాల విద్యార్థుల ప్రగతిని చర్చించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆర్.రామాచార్యులు, సతీష్, వెంకటలక్ష్మి, రమ తదితరులు పాల్గొన్నారు.


బియ్యం, ఆర్థిక సాయం

రఘునాథపాలెం: మండలంలోని చిమ్మపుడి గ్రామం అంబేద్కర్ మోడల్ కాలనీలో అనారోగ్యంతో మృతి చెందిన గుండ్ల సాత్విక్ కుటుంబ సభ్యులకు అదే గ్రామానికి చెందిన మాజీ గ్రామ ఉపసర్పంచ్ గుత్తా వెంకటేశ్వరరావు శనివారం 50 కేజీల బియ్యం, ఆర్థిక సాయం అందించారు.గత ఏడేళ్ల నుంచి కులమతాలకతీతంగా గ్రామంలో ఎవరైనా మృతిచెందితే తనవంతు సాయంగా అందిస్తున్నట్లు వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యులు గుండ్ల ముత్తయ్య, కాళంగి వీరబాబు, రాచార్ల రామూర్తి, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు నిత్యావసరాలు..

ఖమ్మంరూరల్: గత సెప్టెంబర్‌లో వచ్చిన వరదలతో సర్వం కోల్పోయిన మండలంలోని జలగంనగర్‌కు చెందిన 310 మంది వరద బాధిత కుటుంబాలకు 25 కేజీల బియ్యం చొప్పున బదావో బంజార ఫోజేర్ ట్రస్ట్ సేవా సంస్థ ఆధ్వర్యాన శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ ఫౌండర్, డైరెక్టర్ భూక్యా లాజరస్ మాట్లాడుతూ.. మానవతా దృక్పథంతో ఈ వితరణ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆనంద్, ప్రేమ్‌సాగర్‌సింగ్, భూకాయ పూలభాయి, విజయ్, మల్సూర్‌నాయక్, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

బిల్లులు చెల్లించకుంటే పనులు చేయలేం..


కమిషనర్‌కు విన్నవిస్తున్న కాంట్రాక్టర్లు

ఖమ్మంమయూరిసెంటర్: ఇప్పటి వరకు చేసిన పలు అభివృద్ధి పనులు, ఎన్నికల పనులు, వరద సహాయక పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లులు చెల్లించకపోతే కొత్త పనులు చేయలేమని మున్సిపల్ కాంట్రాక్టర్లు పేర్కొన్నారు. ఈమేరకు శనివారం కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్యను కలిసి బిల్లలు చెల్లిస్తేనే పనులు చేయగలమని వివరించారు. దీనిపై స్పందించిన కమిషనర్ జనరల్ ఫండ్ నిధులను వారం రోజుల్లో పెండింగ్ బకాయిల కింద చెల్లిస్తామన్నారు. పనులన్నింటిని సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్టర్ల సంఘం అధ్యక్షుడు పసుపులేటి వెంకటేశ్వరరావు, కాంట్రాక్టర్లు జూగల కిషోర్, శ్రీహరిరాజు, పాలకుర్తి కృష్ణ, బండిసతీష్, తుమ్మ అప్పిరెడ్డి, టి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.